
సాక్షి
పల్నాడు
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



శనైశ్వరునికి పూజలు

మంగళగిరి:మంగళాద్రిలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న శనైశ్వరునికి శనివారం అమావాస్య పూజలు నిర్వహించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: ఎగువ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 3,82,100 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 3,81,655 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం నీటి మట్టం 33.1400 టీఎంసీలు.

రచయిత ప్రభావతి నియామకం



భట్టిప్రోలు: భట్టిప్రోలుకు చెందిన ప్రముఖ కవి, రచయిత దొంతు ప్రభావతిని ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ విశ్వ సాహితీ కళావేదిక చైర్మన్ కె.రమావతి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు.

న్యూస్‌రీల్

టంగుటూరి జీవితం భావితరాలకు ఆదర్శం



నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం భావితరాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో టంగుటూరి జయంతి వేడుకల సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్, అధికారులు నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదరికంలో పుట్టి, పూట కూళ్లలో పనిచేస్తూ ఉన్నత విద్యావంతునిగా, పత్రికా సంపాదకునిగా, ప్రజా నాయకునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, ముఖ్యమంత్రిగా ఎదిగి, సంపాదించిన దానిని ప్రజలకే పంచి, పేదవానిగా మృతి చెందిన మహనీయుడని పేర్కొన్నారు. సైమన్ గో బ్యాక్ నినాదంతో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి గుండె చూపిన ధైర్యశాలిగా పేర్కొన్నారు. రైతుల కోసం అనేక ప్రాజెక్టులు చేపట్టారని, వాటి ఫలాలను రైతులు నేడు అనుభవిస్తున్నారని తెలిపారు. యువతకు వారు చూపిన మార్గం ఆదర్శమని పేర్కొన్నారు. డీఆర్‌ఓ ఏకా మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేటరూరల్: ఇస్సపాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన పూనూరి కోటిరెడ్డి, రమాదేవి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయంలో శనివారం ఈవో నలబోతు మాధవిదేవిని కలిసి విరాళం చెక్కు దాతలు అందజేశారు. పూనూరి కోటిరెడ్డి దంపతుల కుమారుడు వేణుగోపాలరెడ్డి, కుమార్తె ప్రియాంక, పూదోట కిరణ్, ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయశర్మ, నండూరి కాశీకృష్ణలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు సంస్థలు నిబంధనలు పాటించాలి



తాడికొండ: రాజధానిలో పనిచేసే కాంట్రాక్టు సంస్థలు నిబంధనలు పాటిస్తూ కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తుళ్ళూరు డీఎస్పీ మురళీ కృష్ణ సూచించారు. శనివారం తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లో రాజధాని నిర్మాణంలో పాలు పంచుకునే వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. అయితే అందరూ హాజరు కాకుండా అరకొరగా సమావేశానికి రావడంపై ఆయన ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో కార్మికులు ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. సీఐలు శ్రీనివాసరావు, అంజయ్య ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు



గుంటూరు వెస్ట్: ఈ ఏడాది వినాయక చవితి పండుగ సందర్భంగా అందరూ మట్టితో చేసి, సహజ రంగులు వాడే గణనాథుని విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేసిన అవగాహన పోస్టర్‌ను కలెక్టర్‌తోపాటు డీఆర్వో షేక్ ఖాజావలి, పర్యావరణ ఇంజినీర్ ఎండీ నజీమా బేగం, సీపీఓ శేషశ్రీ శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే కొన్ని నిబంధనలు పాటించాలన్నారు. మట్టి వినాయకుడిని పూజించి అందరూ బాధ్యతను చాటుకోవాలన్నారు.

సుజలాం..సుఫలాం

- వాగు నీరు సద్వినియోగ మార్గమేదీ?
- ఏటా 12 వేల క్యూసెక్కులు వృథా
- వర్షం రోజుల్లో పరవళ్లు, ఆపై నిరాశే
- వర్షపు నీరు సద్వినియోగం కాక అల్లాడుతున్న అన్నదాత

యడ్లపాడు: చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు వాగులు వర్షానికి ప్రాణం పోసుకుని ఉప్పొంగి జీవ నదుల్లా ప్రవహిస్తుంటాయి. ఓగేరు, కుప్పగంజి, నక్కవాగు, వేదమంగళ వాగు ప్రధాన వాగులు కాగా, వాటి పాయలుగా ఉప్పవాగు, దంతెన వాగు, నల్లవాగు ఉన్నాయి. ఇవి కొద్దిపాటి వర్షాలు కురిసినా ఎగువ ప్రాంతాల నుంచే వచ్చే వాననీరు, సమీప పొలాల్లోని నీరంతా ఏకమై నిండుగా ప్రవహిస్తాయి. ఆరంభంలో పిల్ల కాలువల్లా కనిపించే ఈ వాగులు దిగువ ప్రాంతాలకు వచ్చేసరికి ఉధృతమై భారీ ప్రవాహంగా మారతాయి. ఆ జలాలు కనీసం సాగుకు ఉపయోగించుకునే అవకాశం లేక ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. ప్రతి వర్షాకాలంలోనూ నిండుగా కనిపించే వాగుల్లో ఏటా సుమారు 22 వేల క్యూసెక్కులు తమ కళ్లెదుటే వృథాగా సముద్రం పాలవుతుంటే గుండెలు తరుక్కుపోతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జల సంరక్షణపై దృష్టి సారించాలి...

ఈ వాగులకు ఇరువైపులా ఉన్న వేలాది ఎకరాలల్లో వివిధ పంటల్ని సాగు చేస్తున్నారు. ఒక వైపు వాగుల్లో వచ్చే వరద నీరు భారీస్థాయిలో సముద్రంలో కలిసిపోవడం, మరోవైపు సాగుకు చుక్క నీరందక ఎండిన పంటలను చూసి రైతులు తల్లడిల్లితుంటారు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే వాగులపై అక్కడక్కడా చెక్ డ్యామ్‌ల నిర్మాణమే చక్కని పరిష్కారమని అన్నదాతలు చెబుతున్నారు. అయితే చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి చట్టపరమైన, సాంకేతిక అడ్డంకులు ఉన్నాయని..వాటివల్ల ప్రమాదాలు నెలకొంటాయని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. చెక్ డ్యామ్‌లు మాత్రమే కాకుండా, ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రత్యామ్నాయం ఆలోచిస్తే జలసవ్వడే!



వర్షాలు లేని సమయంలో చిలకలూరిపేటలోని ఓగేరు వాగు

ప్రత్యామ్నాయాలు ఇలా చేసుకోవచ్చు...

చెక్ డ్యామ్‌ల నిర్మాణం సాధ్యం కాకున్నా, దాని కన్నా మెరుగైన ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి. ప్రవహించే నీటి వనరులుగా కాకుండా, సాగు భూములకు ఉపయోగపడే జీవధారలుగా మార్చే ప్రణాళికలు చేయాలి. అందుకు విధిగా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. వాగులకు అడ్డుకట్టలు వేయకుండా, ప్రవాహానికి అడ్డుపడని విధంగా..వాగులకు ఇరువైపులా ఉన్న పల్లపు ప్రాంతాల్లో పెద్ద పెద్ద చెరువులు, కుంటలు తవ్వించాలి. వాగుల్లోని వర్షం, వరద నీటిని చిన్న కాలువల ద్వారా ఆయా చెరువులు, కుంటలకు మళ్లించి నిల్వ చేయాలి. వాగుల పక్కన, నీరు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో 'రీచార్జ్ పిట్' నిర్మాణాలను ఎక్కువగా చేపట్టాలి. అక్కడక్కడా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి. వీటిద్వారా భూమిలోకి నీరు ఎక్కువగా ఇంకి, భూగర్భ జలాలు పెరుగుతాయి. వర్షాలు కురవని సమయంలో తిరిగి నీటిని పంట పొలాలకు ఉపయోగించుకోవచ్చు. ముందుగా వాగులకు పటిష్ట కరకట్టల్ని ఏర్పాటు చేసుకోవాలి. వర్షపు నీటి సంరక్షణ, సద్వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. వాగుల్లోనూ కరకట్టలపై జంగిల్ క్లియరెన్స్, కాలువలను తవ్వడం, గండ్లను పూడ్చడం వంటి పనులను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలి. ప్రభుత్వం కేవలం నిర్మాణాలు చేపట్టి వదిలేయకుండా, రైతులను, స్థానిక ప్రజలను భాగస్వాములను చేసి కమ్యూనిటీ ఆధారిత నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలి.



ఇటీవల వర్షాల సమయంలో యడ్లపాడు మండలంలోని నక్క వాగు

అలా సాధ్యం కాదు...



వాగులపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చట్టపరంగా సాధ్యం కాదు. వాగులు, నదుల ప్రవాహాలను అడ్డగించి నిర్మాణాలు చేస్తే భారీ వర్షం కురిసినప్పుడు ముందుకు పోదు. కట్టడి కాదు. ప్రవాహం ఒక్కసారిగా వెనక్కు తోసుకుని ఆకస్మిక వరదలుగా మారి సమీప గ్రామాలు, పంట పొలాలను ముంచెత్తుతాయి.

– రేపూడి మల్లికార్జునరావు, డీఈఈ జలవనరుల శాఖ

అసాధ్యమేమీ కాదు



వాగునీటిని పూర్తి స్థాయిలో నిలుపుదల చేయడం అసాధ్యం. కానీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని వృథాగా పోనివ్వకుండా చెక్‌డ్యాంల ద్వారా నిల్వ చేసుకోవచ్చు. అవి భూమిలోకి ఇంకి భూగర్భజలాలు పెరుగుతాయి. తిరిగి సాగునీటిగానూ ఉపయోగపడతాయి. ప్రధానంగా వాగుల ప్రక్షాళన జరగాలి. కరకట్టల పటిష్టత, ఎత్తు పెంచడం, వాగు వెడల్పు పెంచి, పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు పారదర్శకంగా జరగాలి. అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. పులిచింతల ప్రాజెక్టు ఇందుకు ఉదాహరణ!

–డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, నల్లమడ రైతు సంఘం నాయకులు



నిండు కుండలా నాదెండ్ల మండలంలోని కుప్పగంజి వాగు

ప్రత్యేక పీజీఆర్‌ఎస్‌లో 15 అర్జీలు స్వీకరణ



అర్జీ స్వీకరించి సమస్య వింటున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో 15 అర్జీలు స్వీకరించారు. వీటిపై తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాల వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకోని ప్రతి నెలా నాల్గవ శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీఆర్‌ఓ ఏకా మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుటుంబానికి అరెకరం కేటాయించండి

ములకలూరు గ్రామంలోని సర్వే నెంబరు 672లో రెండు ఎకరాల డీకే పట్టాభూమి ఉంది. 30 ఏళ్ల కిందట దానిని నిరుపేద ఎస్సీలకు డీకే పట్టా ఇచ్చారు. వారు ఆ భూమిని వదిలి వేరే గ్రామాలకు వెళ్లిపోవటంతో ఖాళీగా ఉంది. మట్టి మాఫియా ఎకరానికి రూ.10 లక్షలు ఇచ్చి అక్రమంగా మట్టి తవ్వుతున్నారు. వర్షాకాలంలో ఆ మట్టి గుంతల్లో నీరు చేరి పశువులు, గొర్రెల కాపర్లు వాటిలో పడి మృతిచెందే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆ డీకే పట్టాను రద్దుచేసి గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి అరెకరం చొప్పున నలుగురికి అందజేసి న్యాయం చేయండి.

–మీరయ్య మాదిగ, ఎంఆర్‌పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు

రెచ్చిపోతున్న కోళ్ల మాఫియా

- అధిక ధరలకు కోళ్లు అమ్మి సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నేత
- రోజుకు 2,000 కోళ్లకు పైగా అమ్మకాలు
- ఒక్కొక్క కోడికి రూ 50 అదనంగా వసూలు
- ఇతరులు అమ్మితే పోలీసుల ద్వారా బెదిరింపులు
- టీడీపీ ముఖ్య నేత కోసం వ్యాపారులను బెదిరిస్తున్న పోలీసులు.
- గురజాల నియోజకవర్గంలో కొనసాగుతున్న విష సంస్కృతి

సాక్షి టాస్క్ ఫోర్స్: ఇప్పటి వరకు రేషన్ మాఫియా.. లిక్కర్ మాఫియా.. మట్టి మాఫియా...ఇసుక మాఫియాల గురించి విని ఉంటాం, కానీ గురజాల నియోజకవర్గంలో కొత్తగా కోళ్ల మాఫియా రంగంలోకి దిగింది. కోళ్ల మాఫియా అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఏడాదికి కోట్లు సంపాదించుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు ఈ అక్రమ వ్యాపారం ద్వారా ఏడాదికి రూ. మూడు కోట్లకు పైగా అక్రమంగా సంపాదిస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఒక్కొక్క కోడికి రూ.50 అదనంగా వసూలు

టీడీపీ ముఖ్యనేత కోళ్ల వ్యాపారం ద్వారా అక్రమ దందాలకు పాల్పడుతున్నాడు. మాఫియాను తలదన్నేలా ఈ నేత చేస్తున్న అక్రమ వ్యాపారం చూసి ప్రజలు నివ్వెరపోతున్నారు. చికెన్ వ్యాపారంలో గతేడాదిగా తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ అక్రమంగా ప్రజల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. మార్కెట్లో కోడి ధర సుమారుగా



రూ.90 ఉంటే టీడీపీ నేత అదే కోడిని రూ.140 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నాడు. అంటే ఒక్కొక్క కోడికి సగటున రూ.50 అదనంగా వసూలు చేస్తున్నాడు. టీడీపీ నేత రోజుకు 2,000 నుంచి 2,500 వరకు కోళ్లను విక్రయిస్తుంటాడు. అదే పండుగ రోజుల్లో అయితే 3వేల నుంచి 4 వేలకు పైగా కోళ్లను అమ్ముతూ ఉంటాడు. కోడికి రూ.50 అదనంగా వసూలు చేయడం వలన నెలకు సుమారుగా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నాడు. ఏడాదికి సుమారుగా రూ.మూడు కోట్లకు పైగా కోళ్ల అమ్మకాల ద్వారా ఆ నేత అక్రమార్జన చేస్తున్నాడు. ఇప్పటివరకు ఒక దాచేపల్లిలోనే ఈ దందాను కొనసాగించిన ఆయన ఇప్పుడు అధికారాన్ని అడ్డు పెట్టుకొని కోళ్ల దందాని నియోజకవర్గం మొత్తం విస్తరించేందుకు చర్యలు చేపట్టాడు. ఇతర వ్యాపారులను పోలీసుల ద్వారా బెదిరిస్తున్నట్లు సమాచారం.

పోలీసులతో బెదిరింపులు

టీడీపీ ముఖ్య నేత కనుసనల్లోనే పోలీసులు ఇక్కడ ఇతర వ్యాపారులపై బెదిరింపులకు దిగితున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఇక్కడ కోళ్ల వ్యాపారం చేసుకుని చికెన్ విక్రయించుకునే వ్యాపారులంతా ఒక్కసారిగా కనుమరుగయ్యారు. టీడీపీ ముఖ్య నేత పోలీసుల ద్వారా చికెన్, కోళ్ల వ్యాపారం చేసే వ్యాపారులను బెదిరించి ఇక్కడ వ్యాపారాలు చేస్తే కేసులు పెడతామని బెదిరించారు. అంతేకాకుండా ఇక్కడ టీడీపీ నాయకుడికి వ్యతిరేకంగా మీరు వ్యాపారాలు చేస్తే మీపై గంజాయి కేసులు పెడతామని కూడా బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇక్కడ వ్యాపారం చేసేందుకు ఇతరులు భయపడుతున్నారు. టీడీపీ ముఖ్యనేత అదే పార్టీకి చెందిన వ్యాపారులను ఇటీవల బెదిరించటం ఆ పార్టీలో తీవ్ర చర్చకు దారి తీసింది. సొంతం పార్టీ వ్యాపారులనే బెదిరించడంతో తిరుగుబాటు చేసేందుకు సిద్ధం కావడంతో సర్ది చెప్పారు. కోళ్ల వ్యాపారం చేసే టీడీపీ ముఖ్యనేత వ్యవహారంపై తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు రావటం ఆ పార్టీలో చర్చ జరుగుతుంది. కోళ్ల వ్యాపారానికి సంబంధించి సదరు టీడీపీ నాయకుడు సత్తెనపల్లి, నరసరావుపేటలో కూడా తన దందాను సాగించినట్లు తెలుస్తోంది. అక్కడ కూడా అధికారం అడ్డు పెట్టుకొని స్థానిక వ్యాపారులను బెదిరింపులకు గురి చేసినట్లు కూడా సమాచారం.

తగ్గని వరద ఉధృతి



అమరేశ్వరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

- విజయవాడ రోడ్డులో నిలిచిన రాకపోకలు
- అప్రమత్తమైన అధికారులు

అమరావతి: కృష్ణా నదిలో వరద ఉధృతి ఇంకా తగ్గలేదు. అమరావతి వద్ద శనివారం కూడా కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలలో నిలిచిన నీరు కృష్ణా నదిలోకి చేరాల్సి ఉంది. కానీ నదీ ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఎక్కడికక్కడే నీరు నిలిచిపోయింది. అమరావతి–విజయవాడ రోడ్డులో పెదమద్దూరు వద్ద వాగు చప్టాపై ఇంకా రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. చప్టా శిథిలావస్థలో ఉండటం వల్ల అధికారులు రాకపోకలు నిలిపివేశారు. అమరావతి నుంచి విజయవాడ వెళ్లే బస్సులు పెదమద్దూరు వరకు నడుపుతున్నారు. విజయవాడ వెళ్లాలంటే ఆటోలో నరుకుళ్లపాడు ఎండ్రాయి, చావపాడు గ్రామాల మీదుగా సుమారు 10 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్‌శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



పెదమద్దూరు చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

పిచ్చికుక్క స్వైర విహారం

తొమ్మిది మందికి గాయాలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని 26వ వార్డులో ఉన్న సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలు వెనుక వైపు బజారులో పిచ్చికుక్క శనివారం స్వైర విహారం చేసింది. ఉదయం నుంచి తొమ్మిది మందిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చింది. దాడిలో గోపాలం, ఉల్లిగడ్డలు అమ్ముకునే నాగేశ్వరరావు, చిల్లర దుకాణం నిర్వాహకురాలు సుధారాణి, గృహిణి వెన్ను వెంకటరమణ తదితరులు గాయపడ్డారు. ఈ ప్రాంతంలో పలు పాఠశాలలు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు స్కూలు వద్దకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద ఉందని గతంలో ఎన్నోమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కుక్క కరవటంతో కాలికి అయిన గాయం

పట్టించుకోని వైద్య సిబ్బంది

కుక్కల దాడిలో గాయపడిన వారు అన్న క్యాంటీన్ పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లారు. వైద్య సిబ్బంది కుక్క కరిసిన ప్రాంతంలో క్లీనింగ్ కూడా చేయకుండా మేము ఏమీ చేయలేమని దురుసుగా ప్రవర్తించారు. వైద్య సిబ్బందే పట్టించుకోకపోతే ఎవరు పట్టించుకుంటారని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య

- నెహ్రూనగర్ సమీపంలో హత్య
- మృతుడు గుంటూరుకు చెందిన ప్రదీప్‌గా గుర్తించిన పోలీసులు

బొల్లాపల్లి: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామ పరిధిలోని నెహ్రూనగర్ తండాకు వెళ్లే రహదారిలో జరిగింది. బండ్లమోటు, నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు నగరం గోరంట్లలోని మేరీ ప్రియనగర్‌కు చెందిన మున్నంగి ప్రదీప్(43) హత్యకు గురయ్యాడు. ఈనెల 20న మాదల సాంబశివరావు, మున్నంగి ప్రదీప్ కలసి ఆటోలో బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామ పరిధిలోని నెహ్రూనగర్ వెళ్లే రోడ్డులోకి వచ్చి పూటుగా మద్యం సేవించారు. ప్రదీప్‌ను హత్యగావించిన అనంతరం సాంబశివరావు ఆటోలో తన స్వస్థలం గుంటూరు వెళ్లాడు. నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ప్రదీప్ మిస్సింగ్ కేసు నమోదయింది. అనుమానంతో సాంబశివరావును అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెలుగు చూసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందని నల్లపాడు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య మరియమ్మ ఇరువురు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని బండ్లమోటు పోలీసుల ఆధ్వర్యంలో సంఘటన ప్రాంతంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘటన ప్రాంతాన్ని గుంటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి భానోదయ సందర్శించి పరిశీలించి విచారణ చేపట్టారు.

మృతుని కుటుంబంలో విషాదం

ప్రదీప్ మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతదేహం వద్ద అతని భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది.

ఆర్జిత సేవలకు డిమాండ్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):శ్రావణ అమావాస్య నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాలలో ఉభయదాతలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చనలు శనివారంతో ముగిశాయి. శనివారం కూడా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక కుంకుమార్చనలు జరిపించుకున్నారు. సాయంత్రం పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

సెప్టెంబర్ 7న చంద్రగ్రహణం

8వ తేదీ ఉదయం పలు ఆర్జిత సేవలు రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సెప్టెంబర్ 7వ తేదీ రాత్రి రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని కవాట బంధనం(తలుపులు మూసివేయడం) జరుగుతుందని దేవస్థాన వైదిక కమిటీ పేర్కొంది. 7వ తేదీ రాత్రి 9.56 గంటల నుంచి అర్ధరాత్రి 1.26 గంటల వరకు గ్రహణ కాలంగా పేర్కొన్నారు. చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని 7వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంతోపాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం, ఇంద్రకీలాద్రిపై ఇతర ఉపాలయాల తలుపులు మూసివేస్తారన్నారు. 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి సంప్రోక్షణ, స్నపనాభిషేకం, అనంతరం అర్చన, మహానివేదన, హారతి అనంతరం ఉదయం 8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారన్నారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

నివాళులర్పించిన జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలను శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పాల్గొని టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రకాశం పంతులు చెప్పిన తెగువ, ధైర్యం నిరుపమానం అన్నారు. సైమన్ గో బ్యాక్ అంటూ బ్రిటీష్ వారి తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచి ఆంధ్రకేసరిగా పేరుపొందారని తెలిపారు. పట్టుదల, ధైర్యంతో నిరుపేద కుటుంబం నుంచి ముఖ్యమంత్రి పదవిని అధిరోహించి రాష్ట్ర అభివృద్ధికి కృషిచేసారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జీవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ రెడ్డి, ఎస్బీ సీఐ బి.సురేష్‌బాబు, వెల్ఫేర్ ఆర్ఐ ఎల్.గోపినాథ్, ఎంటి ఆర్ఐ ఎస్.కృష్ణ, అడ్మిన్ ఆర్ఐ ఎం.రాజా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి కుంకుమార్చన

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడ శైవ క్షేత్రమైన శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ బహుళ అమావాస్యను పురస్కరించుకుని శనివారం కోటి కుంకుమార్చన, సామూహిక లలిత పారాయణ మహోత్సవం జరిగింది. కార్యనిర్వాహణాధికారి బి. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ పూజా కార్యక్రమాలు జరిపారు. 10 లక్షల పారాయణ, కుంకుమార్చన, అమ్మవారికి శ్రీ సూక్త సహిత దేవి ఉపనిషత్తులతో అభిషేకం, కుంకుమార్చన, దేవీ హోమం, కుష్మాండ పూజ, కూష్మాండ బలి పూజా కార్యక్రమాలు జరిగాయి.

నమో ఏక దంతాయ!

- వినాయక చవితి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు
- వాడవాడలా సిద్ధమవుతున్న చలువ పందిళ్లు
- వినాయక ఉత్సవ నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి
- గణేష్ ఉత్సవ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి
- జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవు



సత్తెనపల్లి గాంధీచౌక్‌లో గణేష్ ఉత్సవానికి సిద్ధం చేస్తున్న చలువ పందిరి

సత్తెనపల్లి: జిల్లాలో వినాయక చవితి సందడి నెలకొంది. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరునికి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ప్రజల సిద్ధమవుతున్నారు. గణపతి నవరాత్రుల ఉత్సవాలకు గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవ కమిటీలు పాటించాల్సిన నిబంధనలు ఇలా ఉన్నాయి..

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు...

గణేష్ మండపాల అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. https://ganeshutsav.net సైట్ లో ఎంటర్ అవ్వగానే న్యూ అప్లికేషన్ క్లిక్ చేసి, మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఓటీపీ వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నెంబరు, ఈ-మెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్/కమిటీ పేరు నమోదు చేయాలి. గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. గణేష్ నిమజ్జనం చేసే తేదీ, సమయం, వాహనం, డ్రైవర్ వివరాలు నమోదు చేసిన అనంతరం పోలీసులు మండపాన్ని పరిశీలించి, అనుమతులు మంజూరు చేస్తారు.

నిబంధనలు ఇలా..

- ఉత్సవాల నిర్వహణకు అనుమతుల కోసం ప్రత్యేకంగా గణేష్ ఉత్సవ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.
- సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందాలి. ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.
- విగ్రహాల ఏర్పాటుకు కమిటీలు తప్పనిసరిగా పోలీసులు అనుమతి పొందాలి.
- వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదు.
- విగ్రహాల వద్ద కానీ, నిమజ్జనాల రోజున కానీ అశ్లీల నత్యాలు ఏర్పాటు చేయరాదు. టపాసులు కాల్చడం, రంగులు చల్లుకోవడం చేయకూడదు.
- మైక్ పర్మిషన్ తీసుకొని, అందులోని నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలి.
- విద్యుత్ శాఖ అనుమతి తీసుకొని తాత్కాలికంగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకోవాలి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి.
- బలవంతపు వసూళ్ల (చందాలు)కు పాల్పడరాదు
- మసీదుల వద్ద విగ్రహాలు ఏర్పాటు చేసేవారు నమాజు సమయంలో సౌండ్ తక్కువగా ఉంచాలి.
- నిమజ్జనం సమయంలో కొత్తవారు కానీ, అనుమానిత వస్తువులు కానీ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- విగ్రహాల వద్ద నిమజ్జన సమయంలో భక్తులు మత్తు పానీయాలు సేవించరాదు. ఇందుకు కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- రాత్రి 11 గంటల కల్లా విగ్రహాల వద్ద కార్యక్రమాలు పూర్తి చేయాలి.
- ఆభరణాలు ధరించి మహిళలు విగ్రహాల వద్దకు రాకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకొని దొంగతనాలను నియంత్రించాలి. విగ్రహాల వద్ద నిఘా ఏర్పాటు చేసుకోవాలి.
- మండపం సమీపానికి పందులు, కుక్కలు మొదలైన జంతువులు రాకుండా నిరోధించాలి. మండపం స్టేజ్ కింద ఖాళీ స్థలాన్ని చెక్కతో మూసివేయాలి.
- మండపాల్లో పేకాట ఆడకుండా, మత్తు పదార్థాలు సేవించకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- సోషల్ మీడియా, వాట్సాప్ మాధ్యమాల ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దు, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దు.
- సంధ్యా సమయానికి ముందే నిమజ్జన ప్రక్రియ పూర్తి చేయాలి.
- విగ్రహాల రక్షణకు పగలు, రాత్రి నలుగురు చొప్పున విగ్రహాల వద్ద ఉంటూ కమిటీలే భద్రత కల్పించుకోవాలి.
- రాజకీయ పార్టీల గుర్తులు ధరించిన కమిటీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

రైలులో బాల కార్మికుల గుర్తింపు

కొండమోడు సమీపంలోని చిల్డ్రన్ హోంకు తరలింపు



రైలులో గుర్తించిన బాల కార్మికులతో పోలీసు అధికారులు

రాజుపాలెం/పిడుగురాళ్ల: హౌరా నుంచి సికింద్రాబాద్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో బాలకార్మికులను రైల్వే పోలీసులు, నీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శనివారం గుర్తించి, పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో వారిని దించారు. బిహార్ రాష్ట్రం బగల్‌పూర్ జిల్లా ఏక్‌ధర గ్రామానికి చెందిన ముగ్గురు బాలకార్మికులు హౌరా – సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో అటూ ఇటూ తిరుగుతుండగా రైల్వే పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురు బాల కార్మికులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరచగా చిల్డ్రన్ హోంకు తరలించాలని సూచించారు. వెంటనే పోలీసులు మండలంలోని కోటనెమలిపురి పరిధిలో గల కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవెలెప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న చిల్డ్రన్ హోంకు తరలించారు. బాలకార్మికుల ద్వారా తల్లిదండ్రుల వివరాలు తెలిసుకుని వారిని రప్పించి అన్ని ఆధారాలతో అప్పజెబుతామని సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు తెలిపారు. పిడుగురాళ్ల రైల్వే ఎస్ఐ హుస్సేన్, ఏఎస్ఐ సంతరాజు, నీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రవికుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రతినిధి రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

చౌటుప్పల్: ఆఫీసుకు వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగిరాకుండా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన గడిపూడి మురారి(30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం వివాహమైంది. మూడు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగడంతో మురారి భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మురారి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌కాలనీలో నివాసముంటున్న తన అక్క కాంచన వద్దకు వచ్చాడు. ఇక్కడే ఉంటూ రోజూ హైదరాబాద్‌లో ఆఫీస్‌కి వెళ్లి తిరిగి రాత్రికి వస్తుండేవాడు. రోజుమాదిరిగానే ఈ నెల 18న ఉదయం సైతం మురారి ఆఫీస్‌కి వెళ్లాడు. అదేరోజు రాత్రి సమయంలో అతడికి తన అక్క ఫోన్ చేయగా.. 'బస్టాండ్ వద్ద ఉన్నాను.. ఇంటికి వస్తున్నా' అని ఆమెకు చెప్పాడు. కానీ ఇంటికి వెళ్లలేదు. ఆ తర్వాత రెండు రోజులు అతడి ఫోన్ ఆన్‌లో ఉన్నప్పటికీ.. అక్క ఎంత ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదు. తన తమ్ముడు హైదరాబాద్‌లో ఏదైనా పనిమీద ఉన్నాడేమోనని, అందుకే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని భావించిన కాంచన అంతగా పట్టించుకోలేదు. 21వ తేదీ నుంచి మురారి సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ అయిపోయింది. ఎంత ప్రయత్నించినా మురారి గురించిన సమాచారం తెలియరాలేదు. దీంతో శనివారం మురారి అక్క కాంచన చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,700

మోడల్ ధర రూ. 2,300

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి




కోటేశ్వరమ్మ (ఫైల్)

సంతమాగులూరు(అద్దంకి రూరల్): బైకు మీద వెళ్తున్న భార్యాభర్తలను వెనకు నుంచి లారీ ఢీకొట్టటంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన సంతమాగులూరు మండలం రామిరెడ్డిపాలెం గ్రామం వద్ద శనివారం జరిగింది. సంతమాగులూరు ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన గద్దల తిరుపతయ్య, అతని భార్య కోటేశ్వరమ్మ (44) బైక్‌పై కొమ్మాలపాడు నుంచి సంతమాగులూరు వైపు వస్తున్నారు. రామిరెడ్డిపాలెంలోని రామాలయం వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. కోటేశ్వరమ్మకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన తిరుపతయ్యను 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగం రాలేదని మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చీరాల అర్బన్: ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం బాపట్ల జిల్లా చీరాల ఐక్యనగర్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐక్యనగర్‌కు చెందిన డి.వెంకటేశ్వర్లు (36) ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీ చేశాడు. హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని గ్రూప్స్, కానిస్టేబుల్ పోస్టులకు ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగశ్రీను తెలిపారు.

యూరియా కొరత లేదనడం హాస్యాస్పదం



ఫిరంగిపురం: వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికీ రైతులకు యూరియా అందుబాటులోకి రాలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం వ్యవసాయ కార్మికసంఘం సమావేశం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు ఇక్కట్లు పడుతుంటే అధికారులు మాత్రం కొరత లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పనులు నిర్వహించి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. వ్యవసాయ పనులు లేక వారు నానా ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్, మస్తాన్‌వలి, ఎ.అంకారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువుల అక్రమాల నియంత్రణకు కమిటీ

- తహసీల్దార్, ఎస్ఐ, ఎంఏఓ సభ్యులుగా తనిఖీ బృందం
- యూరియా పంపిణీ పర్యవేక్షించనున్న తనిఖీ బృందాలు
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: సబ్సిడీలో రైతులకు అందిస్తున్న ఎరువుల అక్రమ నిల్వలు, క్రయ విక్రయాలు, పక్కదారి పట్టడం వంటి కార్యక్రమాలను నియంత్రించేందుకు మండల స్థాయిలో తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువుల అక్రమాలను అరికట్టేందుకు తనిఖీ బృందాలు రోజువారీగా మెరుపు దాడులు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు యూరియా పంపిణీని తనిఖీ బృందాలు పర్యవేక్షిస్తాయని పేర్కొన్నారు. తహసీల్దార్, ఎస్ఐ, మండల వ్యవసాయ అధికారి మండల స్థాయి తనిఖీ బృందంలో సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు. మండల స్థాయి తనిఖీ బృందాల విధుల్లో భాగంగా మండలాల్లోని అన్ని ఎరువుల డీలర్ అవుట్‌లెట్‌లను తనిఖీ చేస్తూ ఈ-పోస్ పరికర బ్యాలెన్స్‌లను భౌతిక స్టాక్‌తో సరిపోల్చుతూ రెండూ సరిపోలుతున్నాయని నిర్ధారించుకోవాల్సి ఉంటుందన్నారు. నిర్ధారణ కోసం నమోదు చేయబడిన రిటైలర్ల స్టాక్ రసీదులు, అంగీకార పత్రాలను నిశితంగా పరిశీలిస్తారన్నారు. ఏవైనా ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత డీలర్లు, పరిశ్రమలపై ఎఫ్‌సీఓ 1985, ఈసీ చట్టం, 1955 ప్రకారం తక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. తదుపరి అవసరమైన చర్యల కోసం డీఏఓ తనిఖీ, చర్యల నివేదికలను ఆలస్యం చేయకుండా సమర్పించాల్సి ఉంటుందన్నారు. యూరియా, టెక్నికల్ గ్రేడ్ యూరియా సరఫరా, స్టాక్ స్థానాన్ని పర్యవేక్షించాలని, అర్హులైన రైతులకు సమానంగా, అవసరాలకు తగ్గట్టు పంపిణీని నిర్ధారిస్తారన్నారు. యూరియా అక్రమ రవాణా, నిల్వను నిరోధిస్తారని, రైతుల నుంచి ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. యూరియాను ముడిసరుకుగా ఉపయోగించే అన్ని పరిశ్రమలు, సరిహద్దుల మీదుగా కదలికలను బృందాలు తనిఖీచేసి తక్షణమే దాడి చేస్తారన్నారు.

ఇండియా స్కిల్స్ కాంపిటేషన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియా స్కిల్స్ కాంపిటేషన్-25కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పోటీ ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో యువత పాల్గొని, తమ ప్రతిభను కనబర్చాలని కోరారు. డీఆర్‌ఓ ఏకా మురళి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి తమ్మాజీరావు, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలి



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు

లక్ష్మీపురం (గుంటూరు): రాష్ట్రంలో 60 నుంచి 70 శాతం కౌలు రైతులే ఉన్నా గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు ఆరోపించారు. వారికి అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలంటే భూ యజమాని సంతకం చేయాలనే నిబంధన వల్ల కార్డులు రాలేదన్నారు. పంట రుణాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. స్పందించి వారి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నాగమల్లేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.సాంబిరెడ్డి, పి.కృష్ణ, అమ్మిరెడ్డి, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితా రూపకల్పనకు వినతి



మున్సిపల్ ఆర్డీ హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెహ్రూనగర్: గుంటూరు జోనల్ పరిధిలోని ఉద్యోగుల సీనియార్టీ జాబితాను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ కోరారు. ఈ మేరకు శనివారం బ్రాడిపేటలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ ఎస్. హరికృష్ణను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు సచివాలయ ఉద్యోగులందరి సీనియార్టీ జాబితాను జూలై 31వ తేదీ లోపు రూపొందించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. అనేకచోట్ల ఇది అమలు కాలేదని చెప్పారు. పారదర్శకంగా జాబితాను సిద్ధం చేయాలని కోరారు. వచ్చే పది రోజుల్లోపు గుంటూరు రీజియన్‌లోని ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో పనిచేస్తున్న వారి జాబితాను రూపొందించి, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని ఆర్డీ పేర్కొన్నట్లు రజాక్ తెలిపారు. తుది సీనియార్టీ జాబితాను రూపొందించి మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయానికి, ఉద్యోగులకు అందిస్తామని చెప్పినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్హా మధు, సంఘ నగర నాయకులు అంకారావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లా స్థాయి ఫెన్సింగ్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికలకు పోటీలను 26వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాలులో ఏర్పాటు చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్టును ఈ నెల 30వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో జరగనున్న 11వ ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌కు పంపిస్తామన్నారు. వివరాలకు 70755 08842 ఫోను నంబర్‌లో సంప్రదించాలన్నారు.